# సమస్యలపై సమష్టి పోరు

## ఏకతాటిపైకి తెదేపా, తెరాస, సీపీఎం, సీపీఐ

హైదరాబాద్ – న్యూస్‌టుడే

శాసనసభలో సమస్యలపై సమష్టిగా పోరాడాలని తెదేపా, సీపీఎం, సీపీఐ, తెరాస నిర్ణయించాయి. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు, సీపీఎం, సీపీఐ, తెరాస పక్ష నేతలు నోముల నరసింహయ్య, చాడ వెంకటరెడ్డి, ఈటెల రాజేందర్‌లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఎవరికి వాళ్లు వాయిదా తీర్మానాలిచ్చి.. వాటిపై చర్చకు పట్టుబట్టడం కంటే ఒకే అంశంపై నాలుగు పార్టీలూ కలిసికట్టుగా వ్యవహరించి ప్రభుత్వం నుంచి సమాధానం రాబట్టాలని నిర్ణయించారు. ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ కచ్చితంగా జరిగేలా చూడాలని అభిప్రాయపడ్డారు. ఏ రోజు అజెండా ఆరోజు ముగిసేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. రైతుల సమస్యలు, వైద్యం వంటి వాటిపై సమష్టిగా నిలదీయాలని, అదేసమయంలో విడివిడిగా తమ తమ అజెండాల మేరకు వ్యవహరించాలని నాలుగు పార్టీలు నిశ్చయానికి వచ్చాయి. తెరాస పక్ష నేతగా నియమితులైన ఈటెల రాజేందర్ చంద్రబాబు ఛాంబర్లోకి రాగానే.. ఈయన వామపక్ష భావాలు గల వ్యక్తి అని సీపీఐ పక్షనేత చాడ వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు.

**సర్కారుకు విపక్ష నేతల సవాల్:** అసెంబ్లీలో ప్రజాసమస్యలను చర్చించడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని విపక్షాలకు చెందిన శాసనసభాపక్ష నేతలు విమర్శించారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయి ప్రజలు అల్లాడిపోతుంటే.. చర్చకు ససేమిరా అంటోందని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి దమ్మంటే ప్రజాసమస్యలన్నిటిపై చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. వర్షాకాల సమావేశాల గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ వాయిదా పడ్డాక శాసనసభ వ్యవహారాల సలహా సంఘం సమావేశం జరిగింది. అనంతరం సీపీఎం, సీపీఐ, తెరాస, భాజపా నేతలు మీడియాతో మాట్లాడారు. వారేమన్నారో క్లుప్తంగా..

**వైఎస్ నైజం బయటపడింది... నోముల:** ముఖ్యమంత్రి వైఎస్ 'అరచేతిలో పెట్టి... మోచేతి వరకూ నాకించే రకం'. బీసీలకు అది చేస్తాం... ఇది చేస్తామంటూ మాటలైతే చెబుతున్నారు. అసలీ నాలుగేళ్లలో బీసీలకు చేసిందేమిటో చెప్పాలి. ఇప్పుడు కాపు, బలిజ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తామనడం ఆపదమొక్కుల్లాంటివి. ధరల పెరుగుదలపై సభలో చర్చకు అనుమతిస్తే.. సరుకుల కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వారిని పట్టిస్తాం.

**ఏరోజు అజెండా ఆరోజే... చాడ:** శాసనసభ సమావేశమైనన్ని రోజులూ ఏరోజు అజెండా ఆరోజే పూర్తి చేయాలి. ఎరువులు, విత్తనాలు, డీజిల్ కొరత, విద్యుత్తు సమస్యలు, అధిక ధరలు, నోడల్ ఏజెన్సీలు, కోస్టల్ కారిడార్, సెజ్‌లకు భూసేకరణ తదితర అంశాలపై చర్చించాలి. సభావ్యవహారాలు సవ్యంగా సాగకపోతే.. అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

**లోపలా బయటా పోరాటం... ఈటెల:** తెలంగాణ సమస్యలపై చర్చించేందుకు సభాపతి అనుమతించకపోయినా సభలో పోరాడతాం. బయట కూడా ఉద్యమం లేవదీస్తాం. తెలంగాణలో 610 జీవో అమలుకాక ఉద్యోగులు, విద్యార్థులు; బొగ్గుగనుల సమస్యతో కార్మికులు, ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**పోయేకాలం దగ్గరపడింది.. కిషన్‌రెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరపడింది. ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించినా చర్చించకపోయినా తనకేమీ ఇబ్బందిలేదన్నట్లుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు. లుంబిని పార్కు, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగి ఏడాది పూర్తయినా ఒక్కరినీ అరెస్టు చేయలేదు. మృతుల కుటుంబాలకు ఎలాంటి సాయం అందలేదు. సభ కార్యక్రమాలు సజావుగా జరిగేందుకు, ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షమైన తెదేపా సహా అన్ని పార్టీలు పరస్పరం సహకరించుకోవాలి.